సాక్షి
చిత్తూరు
శనివారం । 9 । నవంబర్ । 2024



సంక్షేమ పాలన చేతకాక దాడులా!

హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన వారిపై కూటమి నేతలు దాడులు చేస్తారా అని సునీల్‌కుమార్ ప్రశ్నించారు. - 8లో



అక్రమ నిర్మాణాలు నిలిపేయండి

పుత్తూరు మండలం మజ్జిగగుంట వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను ఆపేయాలని ఆర్డీఓ ఆదేశించారు - 8లో



రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు

కారులో ఎర్రచందనం పౌడర్ అమ్మేందుకు వచ్చి యువతతో గొడవపడిన దుండగులు బైరెడ్డిపల్లిపోలీసులకు చిక్కారు. - 8లో

న్యూస్‌రీల్

బెల్టుషాపుల నియంత్రణలో విఫలం



మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: బెల్ట్‌షాపుల నిషేధంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. హోంమంత్రి సొంత జిల్లా అనకాపల్లి మండలం తగరంపూడిలో బెల్ట్ షాపులపై స్వచ్ఛందంగా మహిళలు తిరుగుబాటు చేసి పోలీసులకు పట్టించడమే ఇందుకు సాక్ష్యమన్నారు. పోలీసులు బెల్ట్‌షాపు నిర్వాహకుడి నుంచి 121 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులు ఎక్కడా లేవని చెప్పిన హోంమంత్రి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే రూ.5 లక్షల జరిమానా విధిస్తామన్న సీఎం చంద్రబాబు ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

11న పెన్షన్ అదాలత్

చిత్తూరు కలెక్టరేట్ : ఈపీఎస్ 1995 పెన్షనర్లు, సభ్యులు పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ కడప జిల్లా రీజినల్ పీఎఫ్ కమిషనర్–2 గౌరవ్ మహల్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈపీఎస్ 1995 నిబంధనలను అర్థం చేసుకోవడానికి, తమ ఫిర్యాదులు పరిష్కరించుకునేందుకు ఈ నెల 11వ తేదీన పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పెన్షనర్లు, సభ్యులు మీటింగ్ నంబర్ 2642 286 3795, పాస్‌వర్డ్ 1234 వెబెక్స్‌లో హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.

ఇద్దరు డీఎస్పీల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలో ఇద్దరు డీఎస్పీలకు పోస్టింగులు ఇస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు పోలీసు శిక్షణా కేంద్రంలో పనిచేస్తున్న షానుషేక్‌ను తిరుపతి పోలీసు శిక్షణా కేంద్రానికి, పోస్టింగ్ కోసం వేచి ఉన్న ఎస్.విజయశేఖర్‌ను చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బదిలీ చేశారు.

బలవంతపు సభ్యత్వం

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు వ్యవహారం డ్వాక్రా సంఘాల మహిళల ప్రాణం మీదకు తెస్తోంది. సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని చేరుకోలేని తమ్ముళ్లు అడ్డదారులు తొక్కుతున్నారు. పార్టీపై అభిమానం ఉన్నవాళ్లను గుర్తించి, సభ్యత్వాన్ని ఇవ్వాల్సింది పోయి.. బలవంతపు సభ్యత్వం చేయించుకుంటున్నారు. ఇందుకోసం ఏకంగా టీడీపీ ఎమ్మెల్యేలే స్వయంగా రంగంలోకి దిగారు. అభం–శుభం ఎరుగని మహిళా సంఘాల సభ్యులు టీడీపీ సభ్యత్వం తీసుకోవడంతో వారి భర్తలకు సభ్యత్వం చేయించి వారి నుంచి రూ.200 బలవంతంగా తీసుకుని బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారు.



చిత్తూరులో సభ్యత్వ నమోదు చేయిస్తున్న మహిళా సంఘాలు

- డ్వాక్రా సంఘాల సభ్యులపై టీడీపీ బెదిరింపుల పర్వం
- టీడీపీ సభ్యత్వ నమోదుకు అడ్డదారులు
- సభ్యత్వం ఉంటేనే సంక్షేమ పథకాలు ఇస్తామని పొదుపు సంఘాల మహిళలకు మెలిక
- ఆమెతో పాటు.. భర్తకు సభ్యత్వం ఇచ్చి రూ.200 బలవంతంగా వసూలు
- అడిగితే.. డబ్బు తీసుకునే కదా ఓటేశావ్.. రూ.వంద ఇవ్వలేరా అంటూ బెదిరింపులు
- పలమనేరు, నగరిలో ఒక్క తెలుగు తమ్ముడికీ టీడీపీ శాశ్వత సభ్యత్వం లేదు
- లోలోపలే కుమిలిపోతున్న అక్కచెల్లెమ్మలు

చిత్తూరు అర్బన్: ఎన్నికలప్పుడు అధికారంలోకి రావడానికి చంద్రబాబు ఎట్లయితే అబద్ధపు హామీలు ఇచ్చి జనాలను మభ్య పెట్టారో.. ఇప్పుడు సభ్యత్వ నమోదు కోసం ఆ పార్టీ నేతలు కూడా అడ్డదారులు తొక్కుతున్నారు. అధిష్టానం వద్ద మెప్పు పొందేందుకు టీడీపీ సభ్యత్వ నమోదు కోసం డ్వాక్రా సంఘాల మహిళలను మభ్యపెట్టడం పథకాల ఆశ చూపడం.. భయపెట్టడం.. అక్కడకీ దారికి రాకపోతే వారిని బెదిరించడం.. ఇలా ఎన్ని దారులు ఉంటే అన్నింటినీ ప్రయోగిస్తున్నారు. అధికారంలో చేతిలో ఉండడంతో తెలుగుదేశం పార్టీ నేతలు దిగజారిపోతున్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అన్నీఇన్నీ కావు. ఉచిత గ్యాస్, ఉచిత ఇసుక, ఉచిత బస్సు, రైతులకు ఏటా రూ.20 వేలు, స్కూల్‌కు వెళ్లే ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు, యువతకు నిరుద్యోగ భృతి–ఉపాధి అవకాశాలు పేరిట కూటమి పార్టీల తరఫున సూపర్ సిక్స్ అమలు చేస్తామని హామీలు గుప్పించారు. ఇవికాకుండా టీడీపీ మేనిఫెస్టో, ప్రతి నియోజకవర్గంలో టీడీపీ తరఫున పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక వాగ్దానాల జాబితా చాంతాడంత ఉన్నాయి. సూపర్ సిక్స్‌లో వారం కిందట అమల్లోకి వచ్చిన ఉచిత గ్యాస్.. ఒట్టి గ్యాసే అని తేలిపోయింది. మిగిలిన వాటి సంగతి దేవుడికే తెలియాలి. దీనిపై ఆ పార్టీ కార్యకర్తలు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ తరుణంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంపై సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలు ఆ పార్టీ ఎమ్మెల్యేలకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. ఒక్కో నియోజకవర్గానికి ఎంత మొత్తం సభ్యత్వం చేయాలని లక్ష్యాలను కేటాయించారు. అసలే హామీలు అమలు చేయలేదని ప్రజలు కన్నెర్ర చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు డబ్బులు వెచ్చించి సభ్యత్వం తీసుకోవడానికి పార్టీ సానుభూతిపరుల నుంచి పెద్దగా స్పందన రావడం లేదు.

చిత్తూరు పార్లమెంటు పరిధిలో ఇప్పటివరకు పూర్తయిన టీడీపీ సభ్యత్వ వివరాలు

నియోజకవర్గం	కొత్తవాళ్లు	రెన్యువల్
చిత్తూరు	9,054	5,595
పూతలపట్టు	5,880	1,587
కుప్పం	4,136	5,061
చంద్రగిరి	4,115	2,681
జీడి.నెల్లూరు	3,389	988
నగరి	2,697	1.802
పలమనేరు	2,659	2,253

లక్ష్యం దరి చేరక..!

టీడీపీ సభ్యత్వ నమోదులో సింహ భాగం మహిళా సంఘాల చేయూత ఉన్నప్పటికీ జిల్లాలో లక్ష్యం మాత్రం దరి చేరడంలేదు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు దాదాపు 30 వేల మంది కొత్తగా టీడీపీ సభ్యత్వం తీసుకున్నట్లు హైకమాండ్‌కు నివేదిక ఇచ్చారు. ఇందులో చిత్తూరు నియోజకవర్గంలో అత్యధికంగా 9054 మంది కొత్తగా సభ్యత్వం తీసుకుంటే.. పూతలపట్టులో 5,880, గంగాధరనెల్లూరు 4,377, చంద్రగిరి 4,115, కుప్పంలో 4,136, పలమనేరు 2,659, నగరిలో కేవలం 2,697 మంది ఉన్నారు. అంటే కొత్తగా సభ్యత్వం తీసుకున్నవారి సంఖ్య 62 శాతం ఉంది. ఇప్పటికే సభ్యత్వం ఉన్న వారిని రెన్యువల్ చేయించడంలో ఇది 37 శాతానికి మించలేదు. ఇదే సమయంలో పార్టీలో సీనియర్లుగా చెప్పుకునేవాళ్లు వేల సంఖ్యలో ఉన్నా.. శాశ్వత సభ్యత్వం తీసుకున్న వారిలో పలమనేరు, నగరిలో ఒక్కరు కూడా లేరు. చిత్తూరు, కుప్పం, పూతలపట్టు, చంద్రగిరి, గంగాధరనెల్లూరులో మొత్తం కలిపి 31 మంది మాత్రమే శాశ్వత సభ్యత్వం తీసుకోవడం అధికారపార్టీని నవ్వుల పాలు చేస్తోంది. సభ్యత్వ నమోదుకు మరోనెల రోజులు గడువు ఉండడంతో ఆయా ఎమ్మెల్యేలు మాత్రం మహిళా సంఘాలనే నమ్ముకున్నారనేది సుస్పష్టం.

తలకు మించిన భారం మోపి..



టీడీపీపై కాస్తో కూస్తో సానుభూతి ఉన్న వాళ్లే స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకోవడానికి ముందుకు రాకపోవడాన్ని అధికార పార్టీ ఎమ్మెల్యేలు పసిగట్టేశారు. గ్రామాల్లో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పంచాయతీ ఇన్‌చార్జ్‌ల నుంచి పట్టణాల్లో వార్డు ఇన్‌చార్జ్‌లు, నగర అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఇతర నాయకులపై తలా కొంచెం అన్నట్లు సభ్యత్వ నమోదు భారాన్ని మోపుతున్న ఎమ్మెల్యేలు.. తాజాగా మహిళలపై పడ్డారు. మున్సిపాలిటీల్లో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) కింద పనిచేస్తున్న మహిళా సంఘాలు, గ్రామీణ ప్రాంతాల్లో వెలుగు ద్వారా పనిచేస్తున్న డ్వాక్రా సంఘాల సభ్యులపై టీడీపీ సభ్యత్వ నమోదు భారాన్ని బలవంతంగా రుద్దుతున్నారు. మహిళా సంఘాల్లోని ప్రతిఒక్కరూ తమ పార్టీ సభ్యత్వం తీసుకోవాలని అధికారుల ద్వారా చెప్పిస్తున్నారు. సభ్యత్వం తీసుకోని మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని బెదిరింపులకు దిగుతున్నారు. పైగా బ్యాంకు రుణాలకు మహిళలను సిఫార్సు చేయమని తేల్చి చెబుతున్నారు. మెప్మా, వెలుగులో పని చేసే అధికారులు ప్రజాప్రతినిధుల మాట కాదనలేక, తాము ముందు పడకుండా ఈ భారాన్ని రీసోర్స్ పర్సన్లు (ఆర్‌పీ)లకు అప్పగించారు. ప్రతీ ఆర్పీ ఇటీవల గ్రామాలు, మున్సిపాలిటీల్లో సమావేశాలు పెట్టడం.. సంఘంలోని మహిళ, ఆమె భర్త రూ.100 చొప్పున.. రూ.200 తీసుకొచ్చి ఇచ్చి, కచ్చితంగా టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని చెబుతున్నారు. లేకుంటే సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు ఇవ్వమని తెగేసి చెబుతున్నారు. చేసేదేమీలేక మహిళా సంఘాల్లోని సభ్యుల్లో ఇప్పటికే 60 శాతం మంది బలవంతంగా టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్నారు. కనీసం డబ్బులైనా స్థానిక కార్పొరేటర్ స్థాయి నాయకులు భరించాలని కోరితే.. 'ఏం.. డబ్బు తీసుకునే కదా ఎమ్మెల్యేకు ఓటు వేశావ్, ఇపుడు రూ.వంద ఇవ్వలేవా' అంటూ కొన్నిచోట్ల అవమానంగా మాట్లాడుతున్నారంటూ పలువురు మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వినాయకునికి వెండి యజ్ఞోపవీతం



వెండి ఆభరణాన్ని అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారికి ఓ దాత వెండి యజ్ఞోపవీతాన్ని సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన అరు ణనాయుడు రూ.50 వేల విలువ చేసే యజ్ఞోపవీతాన్ని శుక్రవారం ఆలయ అధికారులకు అందించారు. దాతకు ఆలయ అధికారులు దర్శ నం ఏర్పాటు చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 10వ తేదీ నిర్వహించాల్సిన ఉచిత డీఎస్సీ శిక్షణ స్క్రీనింగ్ ఎంపిక పరీక్షను వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎంపిక పరీక్షను వాయిదా వేశారని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లాలోని అభ్యర్థులు గమనించాలని, తదుపరి స్క్రీనింగ్ పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

11న మైనారిటీ సంక్షేమ దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఈ నెల 11న మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 11న జిల్లా స్థాయిలో అధికారికంగా వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ వేడుకలకు జిల్లాలోని మైనారిటీలు, మతపెద్దలు, ఉపాసకులు, విద్యార్థులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

18 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఉమాదేవి శుక్రవారం తీర్పు ఇచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహన తనిఖీ చేయగా, పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. మొత్తం 18 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఏఎన్‌ఎంలకు ఇతర పనులు కేటాయించొద్దు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలకు ఇతర పనులు కేటాయించకూడదని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. అందుకు సంబంధించి శుక్రవారం ఆ ఉత్తర్వులు కలెక్టరేట్‌కు చేరాయి. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలకు జాబ్‌చార్ట్ ప్రకారం మాత్రమే విధులు అప్పగించాలని ఆదేశించారు.

'రెడ్'హ్యాండెడ్‌గా దొరికిపోయారు

- బైక్‌లో వెళ్తుండగా కారుకు తగిలిన బ్యాట్
- కారు ఆపి స్థానిక యువతతో గొడవకు దిగిన గుర్తు తెలియని వ్యక్తులు
- పోలీసుల సైరన్ విని పరార్
- స్థానిక యూత్ సహకారంతో ఆరుగురిని పట్టుకున్న పోలీసులు
- ఫార్చునర్‌లో తనిఖీ చేయగా ఎర్రచందనం పౌడర్
- బైరెడ్డిపల్లిలో వెలుగు చూసిన ఘటన
- విచారణలో వెలుగు చూడనున్న నిజాలు



కారులోని వ్యక్తులు, క్రికెట్ టీం సభ్యుల మధ్య వాగ్వాదం

పలమనేరు/బైరెడ్డిపల్లి: కారుకు క్రికెట్ బ్యాట్ తగిలిందని క్రీడాకారులతో మొదలైన గొడవ కొత్తరకంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఓ ముఠాను పట్టించింది. ఈ సంఘటన పలమనేరు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన బైరెడ్డిపల్లిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బైరెడ్డిపల్లికి చెందిన పలువురు క్రీడాకారులు క్రికెట్ గ్రౌండ్ నుంచి బైక్‌లపై చెక్‌పోస్టు వద్దకు వెళ్తుండగా అదే మార్గంలో ఓ ఫార్చునర్ కారు వచ్చింది. అక్కడ రోడ్డు ఇరుక్కుగా ఉండడంతో బైక్ వెనుక కూర్చున్న యువకుడి చేతిలోని క్రికెట్ బ్యాట్ ఆ కారుకు తగిలింది. దీంతో డ్రైవర్ కారును రోడ్డు పక్కన ఆపి ఎందుకు బ్యాట్ తగిలించావంటూ గొడవకు దిగాడు. అదే కారులోని వారు సైతం డ్రైవర్‌కు వత్తాసుగా మాట్లాడారు. ఇంతలో క్రికెట్ గ్రౌండ్ నుంచి వస్తున్న పలువురు యువకులు అక్కడికి చేరుకోవడంతో కారులో ఉన్నవారితో వాగ్వాదం జరిగింది.

పోలీసుల సైరన్ విని పరార్..

రోడ్డులో ట్రాఫిక్ స్తంభించడంతో రోడ్డుపై ఏమో జరుగుతోందని గమనించిన ఎస్‌ఐ పరశురాముడు సిబ్బందితో కలసి జీప్‌లో సైరన్ వేసుకుంటూ అక్కడికి చేరుకున్నారు. ఇంతలో కారు బయట ఉన్న వారు, లోపల ఉన్నవారు పోలీసుల రాకను చూసి పారిపోయారు. దీంతో వారిని పట్టుకునేందుకు పోలీసులు వెళ్లారు. వారికితోడుగా క్రికెట్ టీం సభ్యులు, స్థానిక ఆటో డ్రైవర్లు తోడుగా వెళ్లి ఆరుగురిని పట్టుసుకున్నారు. కొందరు పక్కనే ఉన్న గుట్టల వైపునకు వెళ్లి తప్పించుకున్నట్టు తెలిసింది. అనంతరం పట్టుబడిన వారిని కారు వద్దకు తీసుకొచ్చి లోపల గమనించగా పదికి పైగా ఫాస్ట్‌ట్రాక్ స్టూడెంట్ బ్యాగులు కనిపించాయి. అందులో ఎర్రచందనం పౌడర్ ఉన్నట్టు వారు గుర్తించారు. ఇప్పటిదాకా ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ చేయడం చూసిన పోలీసులకు ఇలా పౌడర్ రూపంలో స్మగ్లింగ్ చేయడం కొత్తగా అనిపించింది. పట్టుబడిన వారిని పోలీసులు విచారణ నిమిత్తం పలమనేరుకు తరలించినట్టు తెలిసింది. మొత్తం మీద కొత్త తరహా స్మగ్లింగ్‌పై పోలీసులు పూర్తిస్థాయిలో విచారిస్తే ఈ ముఠాలో కింగ్‌పిన్ ఎవరు ? వీరిది ఏ ప్రాంతం ? ఎర్రచందనం పౌడర్ ఎవరికి చేరుస్తున్నారు ? పైగా ఖరీదైన ఫార్చునర్ కారు ఎవరిదనే విషయాలు తెలుస్తాయి. ఈ విషయం ఇప్పుడు స్థానికంగా హాట్‌టాపిక్ అయింది.

గోకులం షెడ్లకు జియోట్యాగింగ్ తప్పనిసరి

- జిల్లావ్యాప్తంగా 2,327 గోకులం షెడ్లు మంజూరు
- పాడిరైతులకు అవగాహన కల్పించండి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్మిస్తున్న గోకులం షెడ్లకు జియోట్యాగింగ్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డ్వామా, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గోకులం షెడ్ల నిర్మాణ పనులు పారదర్శకంగా నాణ్యతతో చేపట్టాలన్నారు. నాణ్యత లోపిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. గోకులం షెడ్ల నిర్మాణంలో వెటర్నరీ అసిస్టెంట్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన పెంచాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,327 గోకులం షెడ్లు మంజూరు చేయగా, ఇందులో 1,911కు టెక్నికల్ అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే 1377కు జియో ట్యాగింగ్ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 460 పనులు గ్రౌండింగ్ అయ్యాయని, మిగిలిన పనులు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. గోకులం షెడ్లలను నిర్మించుకునేలా పశు సంవర్ధక శాఖ సహాయకులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిని సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలవారీగా మంజూరైన పనుల్లో ప్రారంభించని పనులకు గల కారణాలపై ఏడీలు, ఏపీఓలు సమీక్షించాలన్నారు. ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వారానికి ప్రతి మండలంలో 10 నుంచి 15 షెడ్ల వరకు గ్రౌండింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వందశాతం టెక్నికల్ శాంక్షన్, జియో ట్యాగింగ్ చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనా ప్రకారమే గోకులం షెడ్లు నిర్మించాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరదలి మోజులో పడి మృత్యుఒడికి

- అనాథలైన భార్య, పిల్లలు
- కోడిగానిపల్లె వద్ద ఘటన
- నేడు శవపంచనామా?

గుడుపల్లె: మరదలి మోజులో పడి ఓ వ్యక్తి మృత్యుఒడికి చేరుకున్న ఘటన స్థానికంగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు కథనం.. మండలంలోని కోడిగానిపల్లెకు చెందిన వెంకటేశుకు లలిత, మునెమ్మ ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్దకుమార్తె లలితను కర్ణాటకకు చెందిన దోనిమడుగు గ్రామానికి చెందిన శరవణ(42)కు ఇచ్చి పెళ్లి చేశారు. చిన్న కుమార్తె మునెమ్మను కుప్పం మండలం సందం గ్రామానికి చెందిన వ్యక్తి ఇచ్చి పెళ్లి చేశారు. కానీ కొన్ని కారణాల వల్ల మునెమ్మ భర్తను వదిలి పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆమెకు అక్క భర్త శరవణతో పరిచయం ఏర్పడింది. ఈ విషయంపై లలిత తన చెల్లితో గొడవ పడింది. తరువాత ఆమె కూడా పుట్టింటికి చేరింది. అక్కాచెల్లెలు ఇద్దరూ పుట్టింట్లోనే ఉండేవారు. గత సోమవారం రాత్రి దోనిమడుగు నుంచి శరవణ కారులో కోడిగానిపల్లెకు బయలుదేరాడు. కొంత దూరం వెళ్లాక, కారును ఆపి నడుచుకుని వెళ్తుండగా మార్గమధ్యలో రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన పొలం వద్ద కరెంట్ షాక్ తగిలి శరవణ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మునెమ్మ పొలం యజమాని, మరికొందరి సహకారంతో శరవణ శవాన్ని సమీపంలోని పేడ దిబ్బలో పూడ్చిపెట్టారు. అయితే మూడు రోజులైనా శరవణ ఇంటికి రాకపోవడంతో బంధువులు అంతటా వెతికారు. శుక్రవారం కోడిగానిపల్లె సమీపంలో కారును గుర్తించారు. ఆ వెంటనే పొలం యజమాని రామకృష్ణ కూడా జరిగిన విషయంపై గుడుపల్లె పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటనా స్థలికి చేరుకుని కుప్పం సీఐ మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి శరవణ మృతికి సంబంధించిన వ్యక్తులను విచారణ చేస్తున్నారు. శనివారం మృతదేహం వెలికి తీసి పోస్టుమార్టం చేయనున్నారు.

విధుల్లోకి సంఘమిత్రలు..

సాక్షి ఎఫెక్ట్..

రొంపిచెర్ల : మండల సమాఖ్య కార్యాలయంలో పనిచేస్తున్న ఎనిమిది మంది సంఘమిత్రలు శుక్రవారం విధుల్లో చేరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 14 మంది సంఘమిత్రలను ఎలాంటి కారణం లేకుండా తొలగించారు. దీంతో ఎనిమిది మంది సంఘమిత్రలు హైకోర్టులో కేసు వేయడంతో వారినే కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. అయితే తమను విధుల్లోకి తీసుకోలేదని సంఘమిత్రలు రొంపిచెర్ల స్త్రీ శక్తి భవనం ముందు గురువారం నిరసన తెలిపారు. ఇదే విషయమై 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ''హైకోర్టు ఆదేశించినా.. అధికారులు కరుణించరా..!'' అని కథనం ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. తొలగించిన సంఘమిత్రలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీఎం హరినాథ్‌ను ఆదేశించారు. దీంతో సంఘమిత్రలు విధుల్లో చేరాలని ఫోన్ చేసి ఏపీఎం సమాచారం ఇవ్వడంతో ఎనిమిది మంది సంఘమిత్రలు విధుల్లో చేరారు. అధికారులు స్పందించి న్యాయం చేశారని విధుల్లో చేరిన సంఘమిత్రలు గీత, రష్యాబేగం, ప్రమీల, ఉదయభాను, ధనమ్మ, గీతారాణి, సుబ్బమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: గంగాధర నెల్లూరు మండలంలో శుక్రవారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. వేల్కూరుకు చెందిన యోగేశ్వర్ (34), జీడీనెల్లూరుకు చెందిన మురుగేష్(72) వద్ద నుంచి 42 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుల అరెస్ట్ చూపించారు.

అక్రమ నిర్మాణాలు నిలిపేయండి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

సాక్షి ఎఫెక్ట్..

పుత్తూరు: పుత్తూరు మండలంలోని తడుకు రెవెన్యూ మజ్జిగగుంట వద్ద అక్రమ నిర్మాణాలను తక్షణం నిలిపేయాలని తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'ప్రభుత్వ భూములు అమ్మేస్తున్నా..' అన్న శీర్షికన భూ ఆక్రమణలపై కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్డీఓ సాయంత్రానికి మజ్జిగగుంట వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణాల వద్దకు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా 'మీ తహసీల్దార్ ఎక్కడా' అంటూ డీటీ అశోక్‌రెడ్డిని ప్రశ్నించారు. ఆయనకు గత నెల 30వ తేదీనే సదరు భూముల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఫొటోలతో సహా హెచ్చరించానని తెలిపారు. అందుకు సంబంధించి తన మొబైల్‌లో సమాచారాన్ని తీసి డీటీకి చూపించారు. అయినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా వారు ప్రశ్నిస్తున్నా, పనులు ఆపకపోతే ఏమిటీ దౌర్జన్యం అంటూ ప్రశ్నించారు. తాను ఇక్కడికి వచ్చిన తర్వాత కూడా నిర్మాణాలకు వాటర్ క్యూరింగ్ జరుగుతుంటే ఏమనుకోవాలని నిలదీశారు. 'నేను వస్తున్నానని తెలిసినా పనులను ఆపాలని తెలియదా..? ఇక్కడ నువ్వు ఏం చేస్తున్నావ్' అంటూ వీఆర్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరి తర్వాత ఒకరు వరస పెట్టి నిర్మాణాలు చేపడుతుంటే స్థానికంగా ఇక్కడి అధికారులు ఏం చేస్తున్నట్లు ? అసలు మీరే నిర్మాణాలు చేసుకోమని చెప్పారా ? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి నివేదిక తనకు పంపాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

సెలవురోజు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : సెలవురోజుల్లో ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలుంటాయని డీఈఓ వరలక్ష్మి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9వ తేదీన రెండవ శనివారం సెలవు దినంగా ప్రకటించినట్లు తెలిపారు. అయితే సెలవు రోజుల్లో పలు పాఠశాలలు నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే సంబంధిత పాఠశాలల అనుమతులు రద్దు చేస్తామని డీఈఓ హెచ్చరించారు.

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని..

- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉత్తర్వుల కాపీ అందజేత



హైకోర్టు ఉత్తర్వులు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి

సదుం: తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మండలంలోని 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి చొరవతో వారు హైకోర్టులో కేసులు వేయడంతో వారిలో ఆరుగురిని తిరిగి విధుల్లోకి తీసుకోవాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అందులో మనోజ్(గొంగివారిపల్లె), సుబ్రమణ్యం(బూరగమంద), శ్రీకాంత్(జోగివారిపల్లె), బాలకృష్ణ (మొరవపల్లె), దామోదర(79ఏ చింతమాకుల పల్లె), రమణ (చింతలవారిపల్లె)కు ఉత్తర్వులను ఆయన పంపిణీ చేశారు.

నిబంధనల మేరకు పనులు చేపట్టండి

మండలంలో నిబంధనల మేర ఉపాధి పనులు జరిగేలా చూడాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయ రెడ్డి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన రైతులకు పనులు మంజూరు చేయాలని కోరారు. యంత్రాలతో పనులు చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఓ శ్రీనివాసులు, సర్పంచ్‌లు ఉషారాణి, ఎల్లప్ప, వెంకటరమణ, శ్రీనివాసుల రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, నాయకులు రెడ్డెప్ప రెడ్డి, ప్రకాష్ రెడ్డి, బాబు రెడ్డి, ధనశేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోలో ఖాళీలను భర్తీ చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కోలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నియమాకాలు చేపట్టాలని ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ నాయకులు కోరారు. శుక్రవారం గిరింపేటలోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో అధికారులతో రాష్ట్ర నాయకులు సుధాకర్, హేమకుమార్ మాట్లాడారు. అనంతరం వారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్లలో సిబ్బంది నియామకాలు చేపట్టకుండా ప్రారంభించడం సరికాదన్నారు. ఉన్న ఉద్యోగులనే సబ్‌స్టేషన్లలో విధులకు వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిభారంతో ఉద్యోగులు పొరబాట్లు చేస్తే అధికారులు కక్షసాధింపులకు దిగుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలతో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఆపరేటర్లపై పని భారం వేయడం అన్యాయమన్నారు. సబ్‌స్టేషన్ల వారీగా ఖాళీలను భర్తీ చేయాలని, లేనిపక్షంలో అదనపు పనికి అదనపు వేతనం అందించాలని డిమాండ్ చేశారు. సబ్‌స్టేషన్లలో వాచ్‌మెన్ల నియమించాలని, ఒకరే పని చేస్తున్నప్పుడు ప్రమాదం జరిగితే ఎలా ? అని ప్రశ్నించారు. 33/11 సబ్‌స్టేషన్‌లో స్కిల్డ్ కార్మికులను అదనంగా ట్రీ కటింగ్, మీటర్ రీడింగ్స్, బిల్‌కలెక్షన్లకు తీసుకోరాదన్నారు. సంస్థల్లో మూడు దశాబ్దాలకు పైబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. నాయకులు బాలాజీ, చిట్టిబాబు, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపే లక్ష్యం



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ గల్లా జయదేవ్

తవణంపల్లె: యువతీ, యువకుల్లో నైపుణ్యాభివృద్ధి చేయడమే లక్ష్యమని మాజీ ఎంపీ, అమరరాజ కంపెనీ చైర్మన్ గల్లా జయదేవ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని దిగువమాఘంలో రాజన్న ఫౌండేషన్ సౌజన్యంతో రూ.25 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, ఎయిర్ కండీషన్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో నైపుణ్యం కల్పించాలనే ఉద్దేశంతో అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ యువతను ప్రోత్సహిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమరరాజ సీఈఓ నరసింహులు నాయుడు, సీహెచ్‌ఆర్ హెడ్ కృష్ణ, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్, డీన్ రవికుమార్, ఎలక్ట్రానిక్ సీఈఓ సాజన్‌డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్- కారు ఢీకొని..



సంఘటనా స్థలంలో మృతి చెందిన చరణ్

పెద్దపంజాణి: బైక్‌పై వెళ్తున్న వారిని ఎదురుగా వచ్చిన ఓ కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సహదేవి తెలిపిన వివరాల మేరకు.. గంగవరం మండలం నడింపల్లికి చెందిన వి.వెంకట్రమణ కుమారుడు లక్ష్మీనారాయణ(30)అలియాస్ చరణ్ పలమనేరు మున్సిపాలిటీ రంగాపురానికి చెందిన అస్గర్ కుమారుడు అఫ్సర్(19)తో కలిసి బైక్‌లో పుంగనూరు నుంచి పలమనేరు వైపు వెళ్తుండగా తొలిశమ్మ గుడి వద్ద ఎదురుగాఓ కారు అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఘటనలో బైక్ మీద ఉన్న చరణ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, అఫ్సర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన క్షతగాత్రున్ని 108 వాహనంలో చికిత్స కోసం తరలించగా, అలాగే చరణ్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూల్ రికార్డ్స్ కరెక్షన్ అధికారాల బదలాయింపు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో రికార్డ్స్ కరెక్షన్ అధికారాలను బదలాయింపు చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు శుక్రవారం డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అపార్ కార్యక్రమంలో భాగంగా కరెక్షన్ అధికారాలు బదలాయింపు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాల రికార్డుల్లో అవసరమైన దిద్దుబాటు కోసం ఉత్తర్వుల్లో సూచించిన అధికారాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎంఈఓ, గ్రేడ్-2 హెచ్‌ఎంలు, డీవైఈఓలకు అధికారాలను అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల కరెక్షన్ అధికారాలు ఎంఈఓలకు, జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు సంబంధించి గ్రేడ్-2 హెచ్‌ఎంలకు అధికారాలు బదలాయించినట్లు వెల్లడించారు. ప్రైవేట్ ఉన్నత స్కూళ్లకు డీవైఈఓలకు అధికారాలు అప్పగించారు. 2025 మార్చి వరకు ఇవి అమలులో ఉంటాయని సూచించారు.

సంక్షేమ పాలన చేతగాక దాడులు చేస్తారా ?

- పూతలపట్టు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్ ఫైర్



ఆస్పత్రిలో శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్

చిత్తూరు టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రెడ్‌బుక్ పాలన సాగిస్తోంది. పథకాలు అందించడం లేదని ప్రశ్నించిన వారిపై దాడులు, దొంగకేసులు పెట్టి వేధిస్తోంది. అందులో భాగంగా పూతలపట్టు మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డిపై కూటమి నాయకులు శుక్రవారం పాత కక్షలను మనసులో పెట్టుకుని చిత్తూరులో బహిరంగంగా దాడికి పాల్పడ్డారు. దీనిపై జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి వావిల్‌తోటలోని శ్రీకాంత్‌రెడ్డి ఇంటి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు లైట్లను పగలగొడుతుండగా శబ్దం వచ్చింది. దీంతో ఇంటి పక్కన వారు రావడంతో దుండగులు పరారయ్యారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం స్వగ్రామానికి వెళ్లగా విషయం తెలుసుకున్న సీఐ స్టేషన్‌కు రావాలని పిలిచారు. గురువారం రాత్రి తన ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని, అందుకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీలోని వ్యక్తులను గుర్తించి, ఆధారాలతో స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తానని సీఐకి వివరించారు. అనంతరం ఆయన పార్టీ లీగల్ అడ్వొకేట్‌తో మాట్లాడి చిత్తూరులోని కట్టమంచిలో తన స్నేహితుడి ఇంటికి వెళ్తుండగా కూటమి నాయకులు విచక్షణా రహితంగా రాళ్లతో దాడి చేశారు. అతని కారును ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి శ్రీకాంత్ రెడ్డిని పరామర్శించారు. ప్రశాంతంగా ఉన్న పూతలపట్టులో టీడీపీ గూండాలు అలజడి రేపుతున్నారని, వారికి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు.

లోకేష్ రెడ్ పాలన సాగుతోంది..

రాష్ట్రంలో మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ పాలన కొనసాగుతోందని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్ ఆరోపించారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో కూటమి నాయకుల దాడిలో గాయపడిన మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం చేతగాక, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. విచక్షణా రహితంగా తమ పార్టీ మండల కన్వీనర్‌పై రాళ్లతో దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. మూడు వారాల కిందట పూతలపట్టు మైనారిటీ కో–ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌పై, యాదమరి మండలంలో తమ పార్టీ కార్యకర్త శ్రావణ్‌కుమార్‌పై దాడులు చేశారన్నారు. అలాగే గొడుగుచింతకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడిపై అన్యాయంగా రేప్ కేసు నమోదు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తే ఇలా దాడులు చేస్తారా ? అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరికీ పార్టీ అండంగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.